ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 5 జనవరి 2025

# ముత్యాల ముగ్గులు మురిసెను..

## ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



నర్సంపేట సిద్ధార్థ ప్రైమ్ స్కూల్ ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు

నర్సంపేట/నర్సంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళల మునివేళ్ల నుంచి జాలువారిన ముత్యాల ముగ్గులు.. అవనిని ముద్దాడి మురిశాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్.. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ద్వారక పేట రోడ్‌లో సిద్ధార్థ ప్రైమ్ స్కూల్ (కాకతీయ గ్రాడ్యుయేట్స్ జూనియర్ కళాశాల) మైదానంలో అట్టహాసంగా ముత్యాల ముగ్గులపోటీలు జరిగాయి. ఈ పోటీలకు వరంగల్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు భారీగా తరలివచ్చారు. తమ రంగవల్లికలతో అలరించారు. తమలోని సృజనాత్మకతను చాటుతూ విభిన్న అంశాలను ముగ్గుల్లో పొందుపర్చారు. ధాన్యపు సిరులు, అమ్మవార్లను, గొబ్బెమ్మలు, బంతి, చామంతి, తదితర పూలతో అలంకరించి ఆకట్టుకున్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి, మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, సిద్ధార్థ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరమల్ల మాధవరెడ్డి, ఏవో వీరారెడ్డి, డాక్టర్ ఉజ్వలరాజేశ్వర్‌రావు, 'ఆంధ్రజ్యోతి' వరంగల్ ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ తడుక రాజనారాయణగౌడ్ హాజరవగా.. పెండెం రాజేశ్వరి, మోతె అరుణ, ప్రసూన న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కాగా నర్సంపేటలో జరిగిన 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల నిర్వహణకు పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, నర్సంపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపున ఆ సంఘం అధ్యక్షుడు గంధం నరేందర్, ప్రధాన కార్యదర్శి శింగిరికొండ మాధవశంకర్, మాతృభూమి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైద్యుడు డాక్టర్ ఎ.మోహన్‌రావు, డాక్టర్ జగదీశ్వర్, దాసరి నర్సింహారెడ్డి సహకరించారు.

### సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్న 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు

తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలు కాపాడేలా, భవిష్యత్ తరాలకు అందేలా ఏటా ముగ్గులపోటీ నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి'కి ముఖ్యఅతిథులు, మహిళలు అభినందనలు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' నర్సంపేట వీసీ ఇన్‌చార్జ్ ఉగ్గడి శివుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ కనుమరగువుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ పోటీలతో పదిరోజుల ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చినట్టుందన్నారు. నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలను చూస్తుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయన్నారు. సంక్రాంతి వస్తుందంటే ముగ్గులు నేర్చుకోవడం, ఏ రంగులు వేయాలనే విషయాలు మదిలో మెదిలేవని, ప్రస్తుత సమాజంలో ఇళ్లల్లో ముగ్గులు వేయడానికి స్థలాలు ఉండడం లేదని, ప్రతీ ఒక్కరు

- నర్సంపేటలో అట్టహాసంగా కార్యక్రమం
- రంగవల్లులను తీర్చిదిద్దిన మహిళలు

ఉన్న కొద్దిపాటి స్థలంలోనైనా తమ సంస్కృతికి సంప్రాదాయాలకు చిహ్నమైన ముగ్గులను వేసుకోవాలన్నారు. 'ఆంధ్రజ్యోతి' వరంగల్ ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరో ఇన్‌చార్జ్ తడుక రాజనారాయణగౌడ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థలు కృషిచేస్తున్నాయని, అందులో భాగంగానే ప్రతీ ఏటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నాయన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని.. ప్రతీ ముగ్గులో ప్రజలు జీవన విధానం ప్రతిబింబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' వరంగల్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సుధాకర్, 'ఆంధ్రజ్యోతి' వరంగల్ వీసీ ఇన్‌చార్జ్ కె.నరేందర్‌గౌడ్, జి.ఉమేందర్‌గౌడ్, వడ్లకొండ పవిత్రన్, ఎస్‌కే సర్దార్, జి.శ్రీనివాస్, బి.రమేష్, కె.సతీష్, టి.శ్రీనివాస్, ఏబీఎన్ నర్సంపేట రిపోర్టర్ బుర్ర వేణుగౌడ్, వీడియోగ్రాఫర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### విజేతలు వీరే..



ప్రథమ విజేతగా నిలిచిన మల్లం పద్మకు బహుమతి అందజేస్తున్న ముఖ్యఅతిథులు, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బృందం

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల్లో నెక్కొండ గ్రామానికి చెందిన మల్లం పద్మ ప్రథమ బహుమతిగా రూ.6వేలు నగదు బహుమతి, నర్సంపేట పట్టణానికి చెందిన బోయిని రమాదేవి రెండో బహుమతి సాధించి రూ.4వేల నగదు బహుమతి, నర్సంపేట పట్టణానికి చెందిన కూచన నవ్యశ్రీ తృతీయ బహుమతిగా రూ.3వేల నగదు బహుమతి అందుకున్నారు. అలాగే నర్సంపేటకు చెందిన మిట్టపెల్లి స్వప్న, పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన రాపర్తి సరిత, మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన ఇటుకాల రజిత కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు.



ప్రథమ విజేతగా నిలిచిన మల్లం పద్మ, ఆమె వేసిన ముగ్గు



ద్వితీయ బహుమతి గెలుచుకున్న ముగ్గు, విజేతగా నిలిచిన బోయిని రమాదేవి





తృతీయ విజేతగా నిలిచిన కూచన నవ్యశ్రీ, ఆమె వేసిన ముగ్గు





# నేడు మొగిలిచర్లకు డిప్యూటీ సీఎం రాక

## ఏర్పాట్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వస్తున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మొగిలిచర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ స్థలాన్ని ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రూ.8.4కోట్లతో నిర్మించే మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మొగిలిచర్ల, గొర్రెకుంట, విశ్వనాథపురం గ్రామాల్లో ఈ మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దీంతో మండలంలో లోవోల్టేజీ సమస్య పూర్తిగా తీరనుందని చెప్పారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలను అధికసంఖ్యలో తరలించి విజయవంతం చేయాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, పీసీసీ కార్యదర్శి భీమగోని సౌజన్య, పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, చాడా కొమురారెడ్డి, దూపాకి సంతోష్, పాలకుర్తి సంపత్, కొమ్ము శ్రీకాంత్, ఆకుల రుద్రప్రసాద్, క్లైమెంట్, పోలెపాక సుమన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన స్థలంలో నాయకులతో మాట్లాడుతున్న రేవూరి



# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

## వరంగల్ కలెక్టర్ సత్యశారద



వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా కలెక్టర్లతో శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి భద్రతా మాసోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రవాణా అధికారి లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ భారత్‌పై సమీక్ష

కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛభారత్ మిషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి గ్రామాలు, మండలాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓడీఎఫ్ అమలు తీరులో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ట్రాక్టర్ల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో వేరుచేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థాయి నుంచి సేకరించి స్క్రాప్ డీలర్లకు విక్రయించాలని సూచించారు. చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మురుగు నీటి శుద్ధీకరణ చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎంపీడీవోలు, మునిసిపల్ అధికారులు, స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ హైవే భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ డివిజన్ నుంచి గీసుగొండ, సంగెం, పర్వగిరి, నర్సంపేట డివిజన్ మీదుగా నెక్కొండ మండలాల్లో జరిగే నేషనల్ హైవే పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## నేడు ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

### హనుమకొండలో పాల్గొననున్న మంత్రులు, ఆర్టీసీ అధికారులు

హనుమకొండ టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ప్రయాణం పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం లేకముందు 55 నుంచి 60 శాతం ఉన్న ప్రయాణం.. ప్రస్తుతం 90 శాతానికి పెరిగింది. దీంతో బస్సు సర్వీస్‌లు లేక పాత బస్సులనే పలు రూట్లలో తిప్పిన ఆర్టీసీ అధికారులు.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించలేకపోయారు. బస్సుల కొరతతో ప్రయాణికులు సీట్లు లేక నిల్చొని యేడాదిగా అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసింది. బస్సుల ఏర్పాటుతో రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ పాయింట్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎలక్ట్రిక్ బస్సును ఒకసారి చార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగుతుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, సిరి సిల్ల, తొర్రూరు, జనగామ, ఏటూరునాగారం, మంగపేట, ఇతర రూట్లల్లో ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌లను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు హనుమకొండలో ఆదివారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ధనసరి సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొని బస్సులను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయ్‌భాను తెలిపారు.

## నేటి నుంచి ప్రైవేటు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేటు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈ నెల 26 వరకు హనుమకొండ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో హాస్పిటల్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు ప్రైవేటు హాస్పిటల్స్ క్రీడా పోటీల కార్యనిర్వాహకుడు డాక్టర్ అమర్‌నాథ్ శనివారం తెలిపారు. వరంగల్ ట్రైసిటీస్ నుం చి 32 జట్లు క్రీడా పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో గెలిచిన జట్టుకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో గెలిచిన జట్టుకు రూ.30వేల నగదు పారితోషికాన్ని అందిస్తామన్నారు.

## ఆత్మకూరు సీఐ సంతోష్‌పై డీజీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను ఆత్మకూరు సీఐ సంతోష్ అవమానించారని నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన తేజావత్ సమ్మయ్య నాయక్ శనివారం రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశాడు. బాధితుడు సమ్మయ్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడుంబా రవాణాకు సంబంధించి నందిగామకు చెందిన ఓ యువకుడిపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు రాగా, సదరు యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని నల్లబెల్లి కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సమ్మయ్యా నాయక్‌కు ఆత్మకూరు పోలీసులు పలుమార్లు ఫోన్ చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం యువకుడితో పాటు మరో 10మంది గ్రామస్థులను పట్టుకొని సమ్మయ్యనాయక్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. యువకుడిపై వచ్చిన ఫిర్యాదు గురించి సీఐతో మాట్లాడుతున్న తరుణంలో ఎలాంటి కారణం లేకుండానే సమ్మయ్యనాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నిన్ను స్టేషన్ లోపలికి ఎవరు రానిచ్చారు..' అని గట్టిగా అరుస్తూ సిబ్బందితో ఫొటోలు తీయిస్తూ స్టేషన్ నుంచి బయటికి పంపించారన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**▸▸ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా**



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

లింగాలఘణపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా స్పష్టం చేశారు. శనివారం లింగాలఘణపురం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. రిసెప్షన్ కౌంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై బండి శ్రవణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆవరణలో మొక్కలను నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, అధికారులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ప్రధాన రోడ్డు మార్గాల్లో అత్యధికంగా జరిగే రోడ్డు ప్రమాదాల ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు విషయంలో ఎట్టిపరిస్థితుల్లో అలసత్వం చేయొద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని పోలీసులు కల్పించాలన్నారు. ప్రతీ పోలీస్ సిబ్బంది నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను పంపిణీ చేశారు. కాగా, సీపీకి సాయుధ పోలీసులు గౌరవ వందనంచేసి ఘనంగాస్వాగతించారు. కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

# కొత్తగా మూడు గ్రామ పంచాయతీలు

**▸▸ హనుమకొండ జిల్లాలో రెండు, వరంగల్ జిల్లాలో ఒకటి**

**▸▸ ప్రతిపాదనలు పంపిన అధికారులు**

హనుమకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఎక్కడెక్కడ కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందో ఆరా తీసింది. సంబంధిత అధికారులు నుంచి ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా ప్రతిపాదనలను స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా కలెక్టర్లు, సంబంధిత పంచాయతీరాజ్ శాఖ మంత్రి పేషికి సైతం పంపారు. తాజా ప్రతిపాదనల ప్రకారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అదనంగా మూడు కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో హనుమకొండ జిల్లాలో రెండు, వరంగల్ జిల్లాలో ఒక పంచాయతీ కొత్తగా ఏర్పాటవుతుంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో ఒక గ్రామ పంచాయతీని, అలాగే ఆత్మకూరు మండలంలో ఒక గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో రెండు తండాలను కలిపి ఒక గ్రామ పంచాయతీని చేయనున్నారు. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉన్న, గ్రామాలను కలిపి లేదా గతంలో పంచాయతీల పునఃవ్యవస్థీకరణలో భాగంగా రెండుగా విడిపోయిన తండాలను ఒక గ్రామ పంచాయతీగా చేసేందుకు వీలుగా సంబంధిత మంత్రిత్వశాఖ ప్రతిపాదనలు పంపారు.

ఓటర్లు, జనాభా ప్రాతిపదకన అన్ని విధాలుగా అర్హత ఉన్న గ్రామాలనే పంచాయతీల ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుపై త్వరలోనే ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయనున్నది. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 208 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే పంచాయతీలను కలుపుకొని వీటి సంఖ్య 210కి చేరనున్నది. అలాగే వరంగల్ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 325 పంచాయతీలు ఉన్నాయి. కొత్త దానిని కలుపుకుంటే వీటి సంఖ్య 326కు చేరుకుంటుంది.

## నేటి నుంచి టీసీసీ పరీక్ష హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష హాల్ టికెట్లను ఆదివారం నుంచి సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, టీసీసీ పరీక్ష ఈ నెల 11 నుంచి 17 వరకు పరీక్షలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

వడ్డెపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్(టీజీఎంఎస్‌సీ), హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గ్రూప్స్ -1, 2, 3, 4తోపాటు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి నాలుగు నెలల పాటు బేసిక్ ఫౌండేషన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 16లోపు హనుమకొండ సుబేదారిలోని సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో విద్యార్హత సర్టిఫికెట్లు జతపర్చి సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 7330990322లో సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, వ్యాక్సిలు, టెస్టులకు కావాల్సిన రియేజంట్లు, రాపిడ్ డయాగ్నోస్టిక్స్ వినియోగంపై హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య శనివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించి మాట్లాడారు.

## పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య


వసంత (ఫైల్)

నల్లబెల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి కావడం లేదని ఓ యువ తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుద్రగూడెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అజ్మీర కళమ్మ-అర్జీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరి కంటే పెద్దదైన అజ్మీర వసంత(32)కి ఇంకా పెళ్లి కాలేదు. వసంత కన్నా చిన్నవారైనా ముగ్గురికీ వివాహాలయ్యాయి. కాగా, ఎన్ని పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. అవస్థను భరించ లేక పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు తెలిపింది. కుటుంబ సభ్యులు వెంటనే ద్విచక్ర వాహనంపై నర్సంపేటలోని ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించగా, వసంత మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తమ్ముడు అజ్మీర రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.

# అన్నదాతలకు అందని సాగునీరు

**▸▸ వరి నాట్లకు నీరందక ముదురుతున్న వైనం**

**▸▸ కాలువల ద్వారా నీరందించాలని వేడుకోలు**

**▸▸ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**


చింతగట్టులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సమయానికి సాగుకు నీరు అందకపోవడంతో వరినాట్లు వేసే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శిథిలావస్థలో ఉన్న ఎస్సారెస్పీ ఉప కాలువలను రైతులు తమ సొంత డబ్బులతో పూడిక మట్టి పనులు చేపట్టి సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధాన కాల్వల నుంచి సాగునీరు పోతున్నా.. ఉప కాలువల ద్వారా సాగునీరు అందించకపోవడంతో రైతులు నీరు విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల,శ్రీరాములపల్లి, గోపాలపూర్, హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల నాగారం, సుదాన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు నెల కిందట కాలువల మరమ్మతుల కోసం అధికారులను కలిశారు. కాలువలు సరిగా లేక సాగునీరు రావడం లేదని, నీరు అందక యాసంగి సమయంలో పంట పొలాలు ఎండిపోతున్నట్లు గోడు వెల్లబోసుకున్నారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కమలాపూర్ మండలం అంబాల, శ్రీరాములపల్లి, హసన్‌పర్తి మండలం నాగారం గ్రామాల రైతులు డబ్బులు వసూలు చేసి సొంతంగా రూ.3 నుంచి 4 లక్షల వరకు ఖర్చు చేసి శిథిలావస్థలో ఉన్న కాలువలోని పూడిక మట్టిని జేసీబీల ద్వారా తొలగించి కాలువ మరమ్మతుల పనులు చేశారు.

### అందని సాగునీరు

రైతులు ఖరీఫ్‌లో వరి నారు కోసి నాటు కోసం సిద్ధం చేశారు. సమయానికి సాగునీరు రాకపోవడంతో వరినార్లు ముదిరిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ, డీబీఎం 24 కాలువ ద్వారా రైతుల పంటలకు సాగునీరు అందించే ఉప కాలువలు శిథిలావస్థలోకి చేరినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని కొంత మంది రైతులు చెబుతున్నారు.

### మానేరు డ్యామ్ నుంచి నీటి విడుదల

రెండు రోజుల కిందట యాసంగి పంటల సాగు కోసం కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ నుంచి బుధవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువ గుండా నీరు పోతున్నా.. కమలాపూర్‌తో పాటు ఇతర మండలాలకు సాగునీటిని అందించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను అన్నదాతలు వేడుకుంటున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు 9న కేడీసీలో జాబ్‌మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులకు ఈనెల 9న హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కేడీసీ)లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో డాక్టర్ సుమన్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో 2023-24లో ఇంటర్ పూర్తి చేసిన వారితో పాటు ఈవిద్యా సంవత్సరం ఇంటర్ పూర్తి చేయనున్న విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి పదో తరగతి, ఫస్ట్ ఇయర్ జిరాక్స్ మెమోలతోపాటు ఆధార్ కార్డు, ఫొటో, స్మార్ట్ ఫోన్‌తో హాజరు కావాలని ఆయన కోరారు.

### అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు..

ఇంటర్మీడియెట్ వొకేషనల్ కోర్సు పూర్తైన విద్యార్థులు అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఐఈవో డాక్టర్ సుమన్ శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. 2022 నుంచి 2024 వరకు ఎంఎల్‌టీ, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు అప్రెంటిషిప్ చేసేందుకు ఈ నెల 8లోపు హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.


ముగ్గుల పోటీని ప్రారంభిస్తున్న జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశ్రుతి




ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు, అతిథులు, ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ బృందం







### ఆనందంగా ఉంది..

**మల్లం పద్మ, ప్రథమ బహుమతి విజేత, నెక్కొండ**

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి రావడం ఆనందం కలిగించింది. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి పోటీలతో సంసృతి సంప్రదాయాలను కాపాడిన వారమవుతాం.

### ఉత్సాహంగా పాల్గొన్నాం..

**బోయిని రమాదేవి, ద్వితీయ విజేత, నర్సంపేట**

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నా. నాకు ద్వితీయ బహుమతి వస్తుందని ఊహించలేదు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలాగే భవిష్యత్ తరాలకు తెలుగువారి సంప్రదాయాలను అందించగలుగుతాం.

### అందరితో కలిసి ముగ్గు వేశా.. బహుమతి సాధించా..

**కూచన నవ్యశ్రీ, తృతీయ విజేత, నర్సంపేట**

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారు నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో చాలా మంది మహిళలతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇక మూడో బహుమతిని సాధించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. మున్ముందు నిర్వహించే పోటీల్లో మొదటి, రెండు బహుమతుల్లో ఏదో ఒకటి సాధిస్తానన్న ధీమా వచ్చింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, జైల్ సూపరింటెండెంట్ లక్ష్మీశ్రుతి


ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు



ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న బోయిన రమాదేవి, కూచన నవ్యశ్రీ

# పాట కట్టి.. పదం కదిపి..


కళాకారుడు దేశెట్టి ప్రవీణ్‌కుమార్

- సమాజం కోసం గళం విప్పుతున్న ప్రవీణ్
- చిన్నతనం నుంచే నాటకాలు, పాటలతో ప్రయాణం
- రాష్ట్ర సాంస్కృతిక సారథి సభ్యుడిగా రాణిస్తున్న యువకుడు

యువ

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడికి పాటంటే ప్రాణం.. చిన్ననాటి నుంచే పాటల పట్ల మక్కువ. కాలుకు గజ్జె కట్టి పాటలు పాడుతూ.. వీధి నాటకాలు వేస్తూ కళాకారుడిగా గుర్తింపు పొందాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో గోసి కట్టి.. కాలుకు గజ్జె కట్టి...భుజంపై గొంగడి వేసుకుని ఊరూరా తిరిగి ప్రదర్శనలిచ్చి ప్రజలను చైతన్యవంతం చేసిన యువకెరటం. తనదైన శైలిలో ముందుకు సాగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ.. కళాకారుడిగా గుర్తింపు పొంది.. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడిగా ఎంపికై అందులో రాణిస్తున్నాడు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అతడే మహబూబాబాద్ మండలం కొత్తరెడ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి రామచంద్రయ్య-ధనమ్మల కుమారుడు ప్రవీణ్ కుమ్యార్. ప్రస్తుతం తన కలం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేకంగా పాటలు రాస్తూ గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. తాజాగా ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా పాటను రాసి ఆలపించి అందరి మనసులను గెలుచుకున్నాడు.

### చిరుప్రాయం నుంచే కాలుకు గజ్జె కట్టి ..

ప్రవీణ్‌కుమార్‌కు చిరుప్రాయం నుంచే పాటంటే ప్రాణం. పోరాటాల గడ్డ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటివద్ద ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివి.. అక్కడ కమ్యూనిస్టు పాటలకు ఆకర్షితుడయ్యాడు. చిన్నతనం నుంచే పాటలు పాడుతూ వీధినాటకాలు వేస్తూ పాఠశాల స్థాయిలోనే ప్రసంశలు, మన్ననలు పొందాడు. ఏడో తరగతి చదువుతున్న సమయంలో 1997 సంవత్సరంలో సామాజిక చైతన్య గీతాల పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రథమ బహుమతిని సాధించి అప్పటి కలెక్టర్ నీరాబ్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నాడు. ఆ తర్వాత మహబూబాబాద్‌లో 9 నుంచి డిగ్రీ వరకు చదివి.. కళాశాల స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని సామాజిక, అభ్యుదయ గీతాలు ఆలపించి బహుతులు దక్కించుకున్నాడు.

### కళాకారుడిగా రాణింపు..

తెలంగాణ ఉద్యమంలో తాను సైతం అంటూ ప్రవీణ్‌కుమార్ తన పాటల ద్వారా ప్రజలను ఉత్తేజ పర్చడమే కాకుండా పోరాటాల వైపు నడిపించారు. పూర్వ మహబూబాబాద్ డివిజన్ ప్రాంతంలో ప్రతీ పల్లె, తండాల్లో ధూంధాంలు నిర్వహిస్తూ కళాకారుల బృందంలో ప్రవీణ్‌కుమార్ కూడా తన గానం ద్వారా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తన పాటల ద్వారా ప్రజలకు చేరవేశాడు.

మంచి కళాకారుడిగా గుర్తింపు పొందిన ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథి బృందం సభ్యుడిగా నియమించింది. అప్పటి నుంచి మహబూబాబాద్ నియోజకవర్గ సాంస్కృతిక సారథి బృందంలో పని చేస్తూ నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గూర్చి పాటల రూపంలో వివరిస్తూ ప్రజలు, అధికారుల మన్ననలు పొందుతూ రాణిస్తున్నారు.

పాటలు పాడటమే కాకుండా దరువు వేయడంలో కూడ దిట్ట. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తన కలం ద్వారా సొంతంగా కొన్ని పాటలు రాసి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడుతూ గుర్తింపు పొందుతున్నాడు. తాజాగా కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గాన కోకిల అవార్డును అందుకున్నాడు.


ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి సత్కారం పొందుతున్న ప్రవీణ్‌కుమార్ (ఫైల్)


హుస్నాబాద్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గానకోకిల అవార్డును అందుకుంటున్న ప్రవీణ్ (ఫైల్)

---

# ఐదు దశాబ్దాల అక్షర సౌరభం

- రచనలు, కవితలతో ప్రశంసలందుకున్న అనిశెట్టి రజిత
- కవయిత్రిగా, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు

సాహితి శిఖరం


ప్రజాకవి కాళోజీతో అనిశెట్టి రజిత (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆమెది ఐదు దశాబ్దాల అక్షర ప్రయాణం. తన రచనలు, కవితలతో పా టు సాహిత్య రంగంతో అపూర్వ అనుబంధాన్ని ఏర్పాటు చేసుకు న్నారు. తన అర్ధ శతాబ్దపు ప్రయాణంలో దాశరథి, కాళోజీ, డాక్టర్ సి. నారాయణరెడ్డి లాంటి ప్రముఖుల ప్రశంసలు అందుకుని కవయిత్రి, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొంద రు హనుమకొండ పట్టణానికి చెందిన అనిశెట్టి రజిత. మనసు తలపులకు తోరణాలు తన సాహితీ జ్ఞాపకాలని అనిశెట్టి రజిత చెబుతుంటారు. ఉద్యమాలు, సాహిత్య రంగంతో తన ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లఉన్నాయని చెబుతున్న ఆమెకు ఉమ్మడి రాష్ట్రంలో 1975లో వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర సాంస్కృతిక రజతోత్సవాల్లో సుప్రసిద్ధ కవులతో నిర్వహించిన కవిసమ్మేళనంలో స్థానం దక్కింది. ప్రముఖ కవులు డాక్టర్ దాశరథి, డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, నాయిని కృష్ణకు మారి, కొలకలూరి ఇనాక్ లాంటి వారి సమక్షంలో కవిత వినిపించారు. ఆ సమయంలో ప్రపంచ మంతా పైసా మయం అనే కవితను వినిపించిన రజితను కవులంతా ఎంతగానో ప్రశంసించి ఆమె తలమీద చెయ్యి పెట్టి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అది తనకు అపూర్వ జ్ఞాపకమని, తన సాహితీ చరిత్రలో మరువలేని సంఘటన అని అనిశెట్టి రజిత పేర్కొన్నారు. హనుమకొండలో మరోసారి కేతవరపు రామ కోట శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే.. కవిత ప్రమాణికంగా ఉంటేనే వచ్చి వినిపించాలని రామకోటశాస్త్రి ఆదేశించగా.. భయపడుతూనే ఆమె తన కవితను వినిపించారట. ఆ తర్వాత రామకోటశాస్త్రి ఆమెను ప్రశంసించారట. 1976-77 సంవత్సరం లో తన కవితా సంపుటి కి అచ్చు వేయా లని దాని ప్రతి ప్రజా కవి కాళోజీకి చూపించగా.. కవితలు బాగానే ఉన్నాయి. కానీ లకోటగా ఉన్నాయని, ఇంత చిన్న వయసులో పుస్తకం ఎందుకు ప్రచురిచడం అని సంశయించడంతో రెండు దశాబ్దాల అనంతరం 1997లో నెనొక నల్లమబ్బునవుతా అన్న తొలి ప్రచూరణతో సాహితీ ప్రపంచానికి పరిచమైనట్టు రజిత వివరించారు. కాళోజీనే ఆ సభకు అతిథిగా పిలుచుకున్నానని, ఆకాశమెత్తుకు ఎదిగిన కాళన్న తన కవితలను ప్రశంసించడం ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె చెప్పారు. దాశరథి రంగాచార్య అక్షర షరతులు సందించే మహా రచయిత ప్రశంసలు కూడా అనేక సందర్భాల్లో అందుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రమంతా వందలాది సాహిత్య వేదికలపై పరిచయాలు, స్నేహం, అనుబంధాలు అనేకం. ఇప్పటి వరకు 13 గ్రంథాలు ముద్రించాను. రుద్రమ వేదిక ప్రచురణల వ్యవస్థాపక సభ్యురాలిగా గత దశాబ్దంన్నర కాలంగా మూడోసారి ఆమె జాతీయ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు.


వీవర్స్ ఫ్రంట్ అవార్డుతో అనిశెట్టి రజిత

సామాజికం, సాహిత్యం సమాంత రంగా 20కి పైగా సంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు 38 పురస్కారాలు అందుకున్నారు రజిత. కవి అయిన రచయిత అయిన కళాకారులైనా సాహిత్య, సాంస్కృతిక సైనికు ల్లా క్రమశిక్షణతో ఉండాలని, అధ్యయనంతో రచనలు సాధన చేయాలని, వేదికలు సన్మానాలకు లొంగకూడదని ఆమె యువతకు పిలుపునిస్తున్నారు. సమాజం పట్ల పీడిత జన సమూహాల పట్ల ప్రేమతో సాను భూతి చూపేలా కవిత్వంతో కారుణ్యం కలిగి ఉండేలా రచనలు చేయాలన్నారు. నైతిక విలువలు మానవీయత కవి గమ్యం కావా లన్నారు. మానవ సంబంధాల విస్తరణ సామాజిక శాంతి, కవితా లోకం లక్ష్యం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

---


కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను పంపిస్తున్న సీఐ సత్య నారాయణరెడ్డి

# రేవంత్‌రెడ్డి.. ఇచ్చిన మాట మరువొద్దు

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల నినాదాలు
- కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మరువొద్దని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికెల శ్రీధర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రం నుంచి కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా దొనికెల శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేతిలోనే విద్యాశాఖ ఉన్నదని, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వెంటనే వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అసోసియేషన్ ఆల్ వింగ్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 29 రోజులుగా ఏకశిలా పార్కు వద్ద దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ కాళోజీ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సుబేదారీ సీఐ పి.సత్యానారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది కాళోజీ జంక్షన్ వద్దకు చేరుకుని కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించి వేశారు. కాళోజీ జంక్షన్‌లో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో కొద్దిసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు షఫీ, కుమార్, రమేష్, మనోజ, సరిత, రుద్రారపు రాజు, తండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

---

## ములుగు మునిసిపాలిటీకి
# కేబినెట్ ఆమోదం

పాత బిల్లును సవరిస్తూ.. జాకారం విలీనం

- నాలుగు గ్రామ పంచాయతీలతో విస్తరణ
- బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు




ములుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి, జాకారం గ్రామాలను విలీనం చేయనున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి 2022సెప్టెంబరు 12న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీ చట్టసవరణ బిల్లులో ములుగును మునిసిపాలిటీగా ఏర్పాటుచేస్తూ తీర్మానించింది. ములుగు గ్రామపంచాయతీతోపాటు బండారుపల్లి, జీవంతరావుపల్లిని విలీనం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే బిల్లు సుదీర్ఘకాలం రాజ్‌భవన్‌లోనే నిలిచిపోయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ములుగు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ధనసరి అనసూయ సీతక్కకు మంత్రివర్గంలో కీలక పదవి రావడంతో ప్రజల్లో ఆశలు కలిగాయి. ఆమె చొరవతో గతేడాది జూలై 6న గవర్నర్ మునిసిపాలిటీ బిల్లుకు ఆమోదం తెలిపారు. ఆవెంటనే రాష్ట్రపతి పరిశీలనకు కూడా పంపించారు. అయితే ములుగు మునిసిపాలిటీ పరిధిలోకి జాకారం గ్రామాన్ని తీసుకురావాలనే అంశం తెరపైకి వచ్చింది. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్ జాకారంలోనే ఉండటం, భవిష్యత్ అవసరాలకు ఇక్కడికి సమీపంలో ప్రభుత్వ భూములు ఉండటంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క జాకారంతో కూడిన మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రి సూచనతో జిల్లా కలెక్టర్ గ్రామ సభ ఏర్పాటు చేయించారు. ప్రజలు అంగీకారం తెలపడంతో తీర్మానం నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ప్రస్తుతం జనాభా ప్రకారం ములుగు, బండారుపల్లి, జాకారం, జీవంతరావుపల్లి కలుపుకొని 25వేల మందికిపైగా జనాభా ఉంటుందని అంచనా. ఓపక్క స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర సర్కారు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో కేబినెట్ ఆమోదం పొందిన మునిసిపాలిటీ బిల్లును వెంటవెంటనే గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనకు పంపించి సాధ్యమైనంత త్వరగా ఆమోదింపజేయాలని మంత్రి సీతక్క కృషి చేస్తున్నారు.

### అంబరాన్నంటిన సంబురాలు

ములుగు మునిసిపాలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి ములుగులో సంబరాలు చేసుకున్నారు. జాతీయ రహదారిపై బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ ఏర్పాటుతో ములుగు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, పట్టణాధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు, నల్లెల భరత్‌కుమార్, యాసం రవికుమార్, ఇమ్మడి రాజుయాదవ్, ఎల్లావుల అశోక్‌యాదవ్, లావుడ్య రమేష్, మట్టెవాడ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


ములుగు పట్టణం

---

# కర్షకుల్లో హర్షాతిరేకం

- కిసాన్ సమ్మాన్ నిధి పెంపుతో ఆనందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది లబ్ధిదారులు
- ఆంక్షలతో అందరికీ కేంద్ర ప్రభుత్వ పథకం



హనుమకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాన్ని రూ.6000 నుంచి రూ.10000 వేలకు పెంచుతున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పెంపు వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నదాతలకు అదనంగా రూ.162 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పొందుతున్నారు. కిసాన్ నిధి మొత్తాన్ని పెంచుతూ 2025-26 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన చేయబోతున్నారు. రైతులను ఆరికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాల్లో చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సహాలు రేపింది.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసాన్ సమ్మాన్ యోజన నిధి కింద 4,07,246 మంది రైతులు ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. హనుమకొండ జిల్లాలో 60,100 మంది, వరంగల్ జిల్లాలో 62,1213, జనగామ జిల్లాలో 73,420, మహబూబాబాద్ జిల్లాలో 95,321, ములుగు జిల్లాలో 58,761, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 57,523 మంది రైతులు సమ్మాన్ నిధి పొందుతున్నారు. కాగా, వివిధ కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో 9,253 మంది రైతులకు ఈ పథకం కింద లబ్ధి నిలిచిపోయింది. వీరిలో హనుమకొండ జిల్లాలో 1,520, వరంగల్‌లో 1,652, జనగామలో 17,358, మహబూబాబాద్‌లో 1,842, ములుగులో 1,376, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,128 మంది రైతులు వీరిలో ఉన్నారు. వీరుకాకుండా కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందినవారు, ధరణిలో భూముల వివరాలు సరిగా నమోదు కానివారు, తప్పులు దొర్లినవారు, ఇతరత్రా కారణాల ఫలితంగానూ మరో 1,19,534 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధికి దూరంగా ఉన్నారు.

### కొత్తగా పట్టాలు

నాలుగేళ్లగా ఇప్పటి వరకు 18 విడతలుగా ఏటా రూ.6వేలను మూడు దఫాలుగా జమ చేసింది. 2019 నుంచి కేంద్రం నిబంధనలను సడలించకపోవడంతో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సాయం అందడం లేదు. 2019 ఫిబ్రవరి వరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లింపు దారులను మినహాయించి మిగిలిన పట్టాదారు రైతులకు కిసాన్ సమ్మాన్ జాబితాలో చేర్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరి వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికే వర్తింప చేస్తున్నారు. పట్టాదారు మరణిస్తే ఆ భూమిని విరాసత్ చేసుకున్న వారికి తిరిగి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తమ అవసరాల రిత్యా లబ్ధిదారులు భూములను విక్రయిస్తే ఆ భూములు కొనుగోలు చేసిన వారికి వర్తింపచేయకపోవడంతో ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది.

### ధరణి కారణంగా..

2015లో రాష్ట్ర ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టిన తర్వాత 2018 నుంచి హైసెక్యూరిటీ గల పాస్‌బుక్‌లను రైతులకు అందజేస్తోంది.




2019 ఫిబ్రవరి నాటికి చాలామందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదు. ధరణి పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన తర్వాత అప్పటి భూముల వివరాలు అప్‌డేట్ కాలేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో కొన్ని తప్పులు దొర్లాయి. వాటిని సరిద్దిద్దే నాటికి ప్రభుత్వానికి రెండేళ్లు పట్టింది.

ఈ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మందికి 2019 ఫిబ్రవరి తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదు. రాష్ట్రంలో త్వరలో భూ భారతి అమలులోకి వస్తున్నందువల్ల దీని ద్వారా అయిన రైతుల సమస్యలను పరిష్కరించి కిసాన్ లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని రైతులు కోరుతున్నారు. రైతుబంధు పథకంలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఏటా అవకాశం కల్పిస్తున్నారు. కానీ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఆ అవకాశం లేదు. ఐఎఫ్ఎస్సీ కోడ్ తప్పుగా నింపిన రైతులు సైతం తిరస్కరణకు గురయ్యారు.

బ్యాంకు ఖాతాలు మూతపడ్డ రైతులు, బ్యాంకు ఖాతాలు చెల్లని వారు కూడా ఈ పథకానికి దూరమయ్యారు. 18 ఏళ్ల వయసులోపు రైతులకు ఇది వర్తించడం లేదు. దరఖాస్తు పరిశీలన సమయంలో రైతుల రికార్డులను బ్యాంకు లేదా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) తిరస్కరించడంవల్ల కూడా కొందరు రైతులు సమ్మాన్ నిధిని పొందలేకపోతున్నారు. కిసాన్ సమ్మాన్ నిధిలో చేరాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. అవగాహన లేక చాలా మంది రైతులు చేసుకోవడం లేదు. వీరి సాయం పొందలేపోతున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో కూడా డబ్బులు రావడం లేదు. ఆదాయం పన్ను చెల్లించే రైతులను ఈ పథకం నుంచి తొలగించారు. రేషన్ కార్డుల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే వర్తింపచేస్తున్నారు. రూ.10వేల కంటే ఎక్కువ పించన్ తీసుకున్నవారిని పథకం పరిధి నుంచి తొలగించారు. తర్వాత విడతల్లో అయినా కిసాన్ సమ్మాన్ నిధి అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అర్హులైన రైతులందరికీ డబ్బులు ఖాతాల్లో పడేలా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సడలించాలని, కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

### మరి ఆంక్షల మాటేమిటి ?

సమ్మాన్ నిధి అమలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల సంగతేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా అంత సులువుగా ఈ పథకం లేదు. అర్హులైన అన్నదాతలకు మాత్రమే పెట్టుబడి సాయం అందాలన్న లక్ష్యంతో కేంద్రం సమ్మాన్ నిధి వర్తింపుపై అనేక ఆంక్షలు విధించింది. కేవైసీ తప్పని సరి చేసుకోవాలన్న షరతు పెట్టింది. దీనితో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతులు ఇప్పటికీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిధిలోకి రాలేకపోతున్నారు. సకాలంలో కేవైసీ చేసుకోలేని వేలాది మంది రైతులు డబ్బులు విడుదలైన బ్యాంకుల నుంచి పొందలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పీఎం కిసాన్ నిధిని నోచుకోలేని రైతులు సుమారు లక్ష మంది వరకు ఉంటారని అంచనా.

### నిబంధనలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకంలోని నిబంధనలు సడలించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలా మంది రైతులు ప్రయోజనం పొందలేకపోతున్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల కొంత మంది రైతులు లబ్ధిపొందలేకపోతుండగా, నిబంధ నల సడలింపు లేకపోవడం వల్ల మరి కొంత మంది ఈ పథకం పరిధిలోకి రాలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసా న్ సమ్మాన్ యోజన నిధి ద్వారా సుమారు 4,07,246 మంది ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ పథకం అమలులోకి వచ్చిన మొదట్లో వీరి సంఖ్య 4,16,499 ఉండగా, ఆ తర్వాత కాలంలో వీరి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. వివిధ కారణాల వల్ల 9,253 మంది రైతులవి పెండింగ్‌లో ఉన్నాయి.



## కబ్జాదారులపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్సీ

కాశిబుగ్గ, జనవరి4 (ఆంధ్రజ్యోతి): అజంజాహి కార్మిక భవన్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కలెక్టర్‌ను కోరారు. చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఇచ్చిన ఆధారాలను జతపరుస్తూ శనివారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం ఇచ్చారు. రాత్రికి రాత్రే జేసీబీ, రౌడీల సహాయంతో కార్మిక భవన్‌ను నేలమట్టం చేశారని, పాత ఇంటి నెంబరు, కొత్త ఇంటి నెంబరు ఎవరి పేరు నుంచి ఎవరి పేరు మీదికి ఎలా మారిందో విచారణ చేయాలని, పేరు మార్పిడి సమయంలో మున్సిపల్ సిబ్బందికి ఎలాంటి ఆధారాలు ఇచ్చారో విచారణ జరుపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

## రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

**వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

శంభునిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శనివారం రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ వద్ద గల మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు లేకుండా గాని, సెల్ ఫోన్ మాట్లాడుతూ గాని వాహనాలు నడుపొద్దని విద్యార్థులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



క్రైం రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ నందిరామ్

వరంగల్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏసీపీ నందిరామ్ శనివారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రైమ్ రికార్డులు, శానిటేషన్, పోలీస్ సిబ్బంది కిట్స్‌లను పరిశీలించారు. సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్‌తో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ వి.సందీప్, ఏఎస్ఐలు భిక్షపతి, సాంబయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ అధికారికి నోటీసు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చిన వరంగల్ జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మికి కలెక్టర్ సత్యశారద షోకాజ్ నోటీసు జారీ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా ప్రమాణాలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లాలో రహదారి భద్రతపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై రవాణాశాఖ అధికారి లక్ష్మిని కలెక్టర్ వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సమాచారం.



శంభునిపేటలో డంపింగ్ యార్డ్‌లా మారిన మట్టి కోట రోడ్డు

# కాలుష్య కోరల్లో చారిత్రక కోట

- డంపింగ్ యార్డ్‌గా మార్చిన జీడబ్ల్యూఎంసీ
- కంపు కొడుతున్న పరిసరాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

శంభునిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ఓరుగల్లు కోట కాలుష్య కోరల్లో చిక్కుకుంది. శంభుని పేట జంక్షన్ నుంచి ఖిలా వరంగల్ వెళ్ళే రోడ్డుతో పాటు మాల అగర్త నుంచి దూపకుంట రోడ్ వరకు కాకతీయులు రక్షణ వలయంగా నిర్మించిన మట్టి కోట నేడు చెత్త కోటలా కనిపిస్తోంది. మున్సిపల్ సిబ్బంది ఇక్కడి చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాల్సింది పోయి మట్టి కోటనే డంపింగ్ యార్డ్‌లా మార్చారు. ఏళ్లతరబడి మట్టి కోట పక్కనే చెత్త పోస్తున్నారు. మరోవైపు మాల అగర్తల చెరువును సైతం చెత్తతో నింపేస్తున్నారు. దీంతో స్థానికులు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. 41వ డివిజన్ పరిధిలో గండి నుంచి శంభునిపేటకు దశాబ్దాల క్రితం వేసిన మెటల్ రోడ్డు నేడు పూర్తిగా ధ్వంసమైంది. దీనికి తోడు నగరంలోని చెత్తను కోట వెంబడి పడవేస్తున్నారు. దీంతో పక్కనే ఉన్న మాల అగర్త చెరువు కాలుష్యానికి గురి అయింది. ఒకప్పుడు ఈ చెరువులో మత్స్య సంపదతో పాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేది. ప్రస్తుతం అది మురికి నీటి కుంటగా మారింది. జంతు కళేబరాలు సైతం ఇక్కడే పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం పందులకు ఆవాసంగా మారింది. మరోవైపు కొందరు కబ్జాదారులు మాల అగర్తల చెరువును ఆక్రమించుకుంటున్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**● గుప్త నిధుల కోసం వేట..**

గుప్తనిధుల కోసం ఇప్పటికీ పలు ముఠాలు కోట చుట్టూ తవ్వకాలు సాగిస్తున్నాయి. పలుచోట్ల తవ్వకాలు జరిపి పూజలు చేసి జంతు బలులు ఇచ్చిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతంలో సరైన నిఘా, రక్షణ వ్యవస్థ లేకపోవటం వల్ల దుండగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంభునిపేట జంక్షన్ నుంచి కోట కట్ట వరకు, అదేవిధంగా కోట చుట్టూ రోడ్ నిర్మాణం చేపట్టి సీసీ కెమెరాలు అమర్చాలని కోరుతున్నారు.

**మట్టి కోటను సుందరీకరించాలి..**
**కంద్రాతి రాజు, టీడీపీ జిల్లా నాయకుడు**



కోట చుట్టూ చెత్తను డంపింగ్ చేస్తున్నారు. వ్యర్థాలను పడేస్తున్నారు. దుర్వాసనతో అటుగా వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పర్యాటకులు సైతం వారసత్వ సంపదను చూడలేక పోతున్నారు. ముళ్ళు, పిచ్చి చెట్లను తొలగించి మట్టికోటను సుందరీకరించాలి. చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.



శ్రీమాత స్వచ్ఛంద సంస్థ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్సీ సారయ్య



ఖిలావరంగల్‌లో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు




చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు

# క్యాలెండర్ల ఆవిష్కరణలు

వరంగల్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కొత్తవాడలోని శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ క్యాలెండర్‌ను కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదలకు చేయూతనిస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు నన్నపు సంజీవరావు, ముద్దసాని మల్లిక, కార్పొరేటర్ గుండేటి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ ఎంఆర్‌సీ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఎంఈవో బత్తుల ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నామోజు శ్రీనివాస్, పోశాల కుమారస్వామి, రామరాజు, వి.రవిందర్, హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వరంగల్‌సిటీ: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శనివారం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ..

రైతులు పంట దిగుబడిని పెంచుకునేందుకు వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, చాంబర్ ప్రతినిధులు మడూరి వేద ప్రకాష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కంభంపాటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే తరగతులు ప్రారంభం



శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఖిలావరంగల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం కరాటే శిక్షణ తరగతులను మాస్టర్ ధన్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నరేంద్రస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షన్‌లో భాగంగా శిక్షణ తరగతులను ప్రారంభించామన్నారు. కరాటేతో విద్యార్థులలో ఆత్మస్థైర్యం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఈ శిక్షణ వారానికి 3 రోజులు, నెలకు 12 క్లాసులు, ఒక గంట పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీ ప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



శంభునిపేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మ

శంభునిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోటి రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో 41వ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ పోశాల పద్మ ప్రారంభించి మాట్లాడారు. శంభునిపేట జంక్షన్ నుంచి ఖిలావరంగల్ మట్టి కోట వరకు రోడ్డు నిర్మాణంతో పాటు శంభునిపేట జంక్షన్‌లోని హనుమాన్ దేవాలయంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి సత్యనారాయణ, రవి, శ్రీనాద్, శ్రీధర్, పసునూటి కోటి, కందికొండ మోహన్, జడల రాము, కందగట్ల శ్రీరామ్, నూరోద్దీన్, సల్లావుద్దీన్, మంతాజ్, మహమూద్, నజీర్, మన్సూర్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్‌కుమార్‌కు సేవా పురస్కార్

కాజీపేట. జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట డీజిల్ షెడ్ ఎలక్ట్రానిక్ ల్యాబ్‌లో టెక్నీషియన్ గ్రేడ్-1గా పనిచేస్తున్న టి.ప్రవీణ్‌కుమార్‌కు విశాల్‌రేల్ సేవా పురస్కార్ అవార్డు దక్కింది. లోకో ఇంజన్‌లను అతి తక్కువ ఖర్చుతో ఎలక్ట్రానిక్ కార్డు, కాంపోనెంట్స్‌తో రిపేర్ చేసి రైల్వేకు రూ.2 కోట్ల 73 లక్షలు ఆదా చేసినందుకు ఈ అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి ఆయన ఈ అవార్డును సికింద్రాబాద్‌లో జీఎం అరుణ్‌కుమార్ చేతులమీదుగా అందుకున్నారు.

## యువత గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

**మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమేష్

మామునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మామునూరు సీఐ రమేష్ సూచించారు. శనివారం జాగృతి పోలీసు కళాబృందం సభ్యులు బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. చదువు ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. ఆడపిల్లలపై దాడులు జరిగితే 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు ఎక్కడ కనిపించినా 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రైతులకు న్యాయం చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, రైతులు

వడ్డెపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ రైతులకు తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని గ్రీన్ ఫీల్డ్ ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల జేఏసీ కన్వీనర్ బి.రాంచందర్‌రావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జేఏసీ నేత లు ఎం.సంధ్యారాణి, స్వప్న, బి.రాజిరెడ్డిలు మాట్లాడారు. నాగపూర్ నుంచి అమరావతి వరకు వెళ్లే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఉమ్మడి వరం గల్ జిల్లాలోని వ్యవసాయ భూముల నుం చి వెళ్తోందని అన్నారు. దీంతో కోట్లాది విలు వ చేసే లక్షలాది ఎకరాల భూములు గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో పోతున్నాయని ఆవేదన వ్య క్తం చేశారు. తాము అభివృద్ధికి ఆటంకం కాదని చెప్పారు. గ్రామ గ్రామాన భూముల బహిరంగ మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. చట్టప్రకారం తమకు నష్టపరిహారం మూడు రేట్లు కలపాలని డిమాండ్ చేశారు. భూ సేకరణకు సంబం ధించి రైతుల అనుమతిని తీసుకున్న తర్వా తే ఒకే దఫాగా డీడీ రూపంలో అవార్డును ప్రకటించాలనిఅన్నారు. రైతులందరు శాశ్వ తంగా భూమిపై ఉన్న జీవన భృతిని తర తరాలుగా కోల్పోనున్నారని పేర్కొన్నారు. టోల్ రుసుములో 70శాతం శాశ్వత వాటా ను భూములు కోల్పోయిన రైతులందరికీ ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వివిధ జిల్లాల కలెక్టర్లకు రైతులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు జేఏసీ నేతలు సతీష్, వేణు, దేవేందర్‌రెడ్డి, రాజేందర్, మనోహర్‌రావు, సాంబయ్య, రాజు, మనోహ ర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, రఘుపతి, బాబుచారి, శివకుమార్, బొల్లు సమ్మిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సమయం పాటించాలి

**● డీఎంహెచ్‌వో సాంబశివరావు**



పీహెచ్‌సీలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న సాంబశివరావు

ఖిలావరంగల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు సరైన వైద్యాన్ని అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ బి.సాంబశివరావు సూచించారు. శనివారం ఆయన ఖిలావరంగల్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందులను, స్టాఫ్ రిజిస్టర్‌లను, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ రోజు ముగ్గురు సెలవులో ఉన్నారని, ఇద్దరు రావడం లేదని, తక్కువ ఉన్న సిబ్బందిని నియమించాలని డాక్టర్ సుధ వైద్యాధికారిని కోరారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారని, వారికి సరైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, మాతా, శిశు సంరక్షణ, డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వెంటవెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి చికిత్స అందించాలన్నారు. ప్రజలు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సూచనలు పాటించాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లైతే ప్రభుత్వ ఆస్పత్రులలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో అనిల్‌కుమార్, ఏఎన్ఎం రేష్మా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక విధానాన్ని అడ్డుకోవాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు రైతు సంఘం వినతి**



హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ వ్యవసాయం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ప్రైస్ డెఫిసిటీ పేమెంట్ స్కీమ్(పీడీపీఎస)ను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరుతూ రైతుసంఘం నాయకులు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 'నీతి అయోగ్' పేరుతో సీసీఐ కొనుగోళ్లను నిలిపివేసి ఎలాంటి చట్టబద్ధత లేని పత్తికి ధరల లోటు చెల్లింపు పథకా(పీడీపీఎస్)న్ని తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని చేస్తోందని, దాన్ని అడ్డుకోవాల్సిన అవసరముందని మంత్రికి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నర్ల చంద్రశేఖర్, మోర్తాల రవిందర్, గోనె కుమారస్వామి, నాగూర్ల శంకర్‌రావు, జెండా రమేష్, సంపత్‌కుమార్, బాషిపాక రమేష్, నర్సయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఎఫ్ సదస్సును విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న శనివారం హైదరాబాద్ లోని ఉస్మానియా వర్సిటీలోని ఠాకూర్ ఆడిటోరియంలో నిర్వహించే మాదిగ ఉద్యో గుల సదస్సును విజయవంతం చేయాలని కేయూ ఎంఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పోడేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కేయూ బయోటెక్నాలజీ విభాగంలో ఎంఈఎఫ్ పోస్టర్ కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. వేల గొంతుల లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న లయన్ అడెపు రవీందర్

పోచమ్మమైదాన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మాసూంఅలీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన లీడర్‌షిప్ చైర్మన్ డాక్టర్ అడెపు రవీందర్ మాట్లాడుతూ.. తాను ఈ పాఠశాలను దత్తత తీసుకొని సుమారు ఆరేళ్ల నుంచి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించి, వారి ఉన్నతికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పోతన అధ్యక్షుడు జంగా ధర్మా, మాజీ అధ్యక్షుడు లకుం అయిలయ్య, కోశాధికారి చిలుపూరి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు బీవియన్ స్వామి, జోసఫ్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, మార్గం యెల్లయ్య, సునీత, నవ్య, కనకయ్య, కమలాకర్, భిక్షపతి, ఠయ్యాల శ్రీధరాచార్యులు, దేవేందర్, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు రూ.26వేల వేతనం అందించాలి

**» సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్**

**» బల్దియా కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నా**



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేష్

వరంగల్ కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 48 గంటల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 2016లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు తెప్పిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు బీజేపీ ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలకు వేతనాలు పెంచడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో శానిటేషన్ కార్మికుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. తక్షణమే మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సి ఉన్నా ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. బల్దియా ఔట్ సోర్సింగ్, మలేరియా కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ నాయకులు మహేశ్, జన్ను ప్రకాశ్, బాబురావు, కృష్ణ, యాస బాబు, నవనీత, కోటేశ్వర్, సుశీల్, కుమార్, రాజు, రంజిత్, నగేశ్, పాపయ్య, సుజాత, ప్రభ, సువర్ణ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

హసన్‌పర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని కాజీపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా శనివారం మండలంలోని నాగారం గ్రామంలో కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్‌లు వట్టి చేరాలు, హరికృష్ణ, పులి రమేష్‌లు పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. నేరాలు జరిగినప్పుడు ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవమరించి నేరాల నియంత్రణకు తమ సంపూర్ణ మద్దతు ఇచ్చి పోలీసులతో సహకరించాలన్నారు. అంతేకాకుండా యువత మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాలు, రోడ్డు భద్రతా వారోత్సవాలు, సైబర్ క్రైం, మూఢనమ్మకాలపై అవగా హన కలిగి ఉండాలని స్థానిక ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి పోలీసు సిబ్బంది, నాగారం గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

**హనుమకొండలో పాల్గొననున్న మంత్రులు, ఆర్టీసీ అధికారులు**

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ప్రయాణం పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం లేకముందు 55 నుంచి 60 శాతం ఉన్న ప్రయాణం.. ప్రస్తుతం 90 శాతానికి పెరిగింది. దీంతో బస్సు సర్వీస్‌లు లేక పాత బస్సులనే పలు రూట్లలో తిప్పిన ఆర్టీసీ అధికారులు.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించలేకపోయారు. బస్సుల కొరతతో ప్రయాణికులు సీట్లు లేక నిల్చొని యేడాదిగా అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసింది. బస్సుల ఏర్పాటుతో రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ పాయింట్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎలక్ట్రిక్ బస్సును ఒకసారి చార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగుతుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, తొర్రూరు, జనగామ, ఏటూరునాగారం, మంగపేట, ఇతర రూట్లల్లో ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌లను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు హనుమకొండలో ఆదివారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ధనసరి సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొని బస్సులను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం డి.విజయ్‌భాను తెలిపారు.

రారండి.. ముగ్గులు వేయగ..

## నేడు'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

వేదిక : ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానం, కొత్తబస్టాండ్ రోడ్, హనుమకొండ

సమయం : ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు



హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఆదివారం హనుమకొండ కొత్త బస్టాండ్ రోడ్డులోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానంలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్.. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మహిళలు 9గంటలకల్లా గ్రౌండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక జిల్లా స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.

**నిబంధనలివీ..**

మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, తదితర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్నివరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. గొట్టాలు, బద్దలు, ఇతర పరికరాలు ఏమీ ఉపయోగించకుండా కేవలం చేతితోనే ముగ్గు వేయాల్సి ఉంటుంది. ఇక ముగ్గు అందంగా కనపడేందుకు సంప్రదాయరీతిలో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు.

## పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- పలు డివిజన్లలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన



కిషన్‌పురలో కాలనీవాసులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరంలో అమలవుతున్న పారిశుధ్య పనుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్య అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. సమగ్ర శానిటేషన్ నిర్వహణలో భాగంగా జీడబ్ల్యుఎంసీ తరుపున ఎంపిక చేసిన 6, 49 డివిజన్‌లలో కిషన్‌పుర, రెవెన్యూ కాలనీలలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 66 డివిజన్‌లలో ముందుగా రెండు డివిజన్‌లను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. ప్రయోగాత్మకంగా సమగ్ర శానిటేషన్ నిర్వహణ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. రెండు డివిజన్‌లలో పలు కాలనీల ప్రజలు, అపార్ట్‌మెంట్ నిర్వాహకులు, ఎన్జీవోలు, విద్యాసంస్థల నిర్వాహకులు సహకరించాలన్నారు. కరపత్రాలు, బ్యానర్ల ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తామన్నారు. 10 బయో కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేస్తామని, బయో కంపోస్టు యూనిట్‌కు అంబేద్కర్ జంక్షన్ సమీపంలోని పాత మున్సిపల్ గెస్టహస్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రతీ రోజు 10 టన్నుల చెత్తను బయో కంపోస్టు ఎరువు తయారు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. సేకరించిన తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ చేయడానికి ఐటీసీ వారికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానస, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారులు పలాస రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ మహేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఓపెన్ జిమ్ పరికరాలను మరమతు చేయండి

పార్కుల్లో దిబ్బతిన్న పరికరాలను మరమతు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ డాక్టర్ కాలనీ, ఎల్బీనగర్‌లోని పార్కులను శనివారం బల్దియా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. దెబ్బతిన్న జిమ్ పరికరాలను ఇంజనీరింగ్ అధికారులు గుర్తించి రిపేరుకు కావలసిన అంచనాలను రూపొందించాలన్నారు. పార్కుల లోపల గోడలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కులకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆహ్లాదం కోసం గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారులు పలాస రమేష్, లక్ష్మారెడ్డితోపాటు ఏఈ నరేష్, హెచ్‌ఏలు ప్రిన్సీ, అనూహ్యలు పాల్గొన్నారు.

### నిర్దేశిత గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

బల్దియా పరిధిలో జరుగుతున్న పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు సమర్థవంతగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఐసీసీకి సంబంధించి జీఐఎస్ మ్యాపింగ్ పని తీరు పరిశీలించాలని, ఇందులో అన్ని కాంపోనెంట్స్ పని చేసేలా స్మార్ట్‌సిటీ ప్రతినిధులకు సూచించారు. అంతేకాకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్మార్ట్‌సిటీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతీరోజు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు తాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. ఇంకా వీధిదీపాల నిర్వహణ, వాహనాల మరమతుపై సంబంధిత ఈఈని అడిగి తెలుసుకున్నారు. తర్వాత వరంగల్ లక్ష్మీపురంలో నిర్మాణం జరుగుతున్న వెజ్-నాన్ వెజ్ మార్కెట్ పనుల పురోగతిపై సమీక్షించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల డీపీఆర్ తయారీపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, ఏసీపీ ఇమ్రాన్‌ఖాన్, స్మార్ట్‌సిటీ పీఎంసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎల్బీనగర్ పార్కులో అధికారులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే





## నేడు మొగిలిచర్లకు డిప్యూటీ సీఎం రాక

**ఏర్పాట్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి**

గీసుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వస్తున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మొగిలిచర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ స్థలాన్ని ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రూ.8.4కోట్లతో నిర్మించే మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మొగిలిచర్ల, గొర్రెకుంట, విశ్వనాథపురం గ్రామాల్లో ఈ మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దీంతో మండలంలో లోవోల్టేజీ సమస్య పూర్తిగా తీరనుందని చెప్పారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలను అధికసంఖ్యలో తరలించి విజయవంతం చేయాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, పీసీసీ కార్యదర్శి భీమగోని సౌజన్య, పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, చాడా కొమురారెడ్డి, దూపాకి సంతోష్, పాలకుర్తి సంపత్, కొమ్ము శ్రీకాంత్, ఆకుల రుద్రప్రసాద్, క్లైమెంట్, పోలెపాక సుమన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన స్థలంలో నాయకులతో మాట్లాడుతున్న రేవూరి

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**వరంగల్ కలెక్టర్ సత్యశారద**



వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా కలెక్టర్లతో శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి భద్రతా మాసోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రవాణా అధికారి లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ భారత్‌పై సమీక్ష

కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛభారత్ మిషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి గ్రామాలు, మండలాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓడీఎఫ్ అమలు తీరులో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ట్రాక్టర్ల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో వేరుచేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థాయి నుంచి సేకరించి స్క్రాప్ డీలర్లకు విక్రయించాలని సూచించారు. చిన్న గ్రామాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మురుగు నీటి శుద్ధీకరణ చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎంపీడీవోలు, మునిసిపల్ అధికారులు, స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ హైవే భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ డివిజన్ నుంచి గీసుగొండ, సంగెం, పర్వగిరి, నర్సంపేట డివిజన్ మీదుగా నెక్కొండ మండలాల్లో జరిగే నేషనల్ హైవే పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, తహసీల్దార్లు పాల్గొన్నారు.





## సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి

నల్లబెల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై గోవర్ధన్ మాట్లాడుతూ.. సమాజంలో సైబర్ నేరాలు ఇటీవల కాలంలో ఎక్కువ అయ్యాయని అన్నారు. అపరిచితులు ఫేక్ నెంబర్‌ల నుంచి ఫోన్ చేస్తూ మేము పంపించిన లింకును ఓపెన్ చేయమని మత్తు మాటలతో ప్రేరేపిస్తారన్నారు. తెలియని లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. ఒక వేళ లింక ఓపెన్ చేస్తే అకౌంట్ మొత్తం ఖాళీ అవుతుందన్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. చదువుకునే దశలో సెల్‌ఫోన్ వాడకపోవడమే మంచిదని తెలియ జేశారు. కార్యక్రమంలో పోలీసులు వేణు, రాకేష్, రేవంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లబెల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్సై గోవర్ధన్

క్రైం కార్నర్

### యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

వర్ధన్నపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పైచదువు కోసం తండ్రి డబ్బులు ఇవ్వలేకపోవ డంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నా నికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవాని కుంటతం డాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట భవానికుంటతండాకు చెందిన సపావత్ నరేష్ (20) డిగ్రీ పూర్తిచేశాడు. పైచదువుల కో సం తండ్రి రవి డబ్బులు ఇవ్వక పోవడంతో డిసెంబర్ 15న క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నంచేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చి కిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

నెక్కొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని నక్కలగుట్ట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నక్కలగుట్ట గ్రామం రైతు దరావత్ వాలికి కుటుంబ సభ్యులు శనివారం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఆ సమయంలో పూరిల్లులో విద్యుదా ఘాతం సంభవించింది. ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, బియ్యం, వంట సామగ్రి, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో వాలి కుటుంబ సభ్యులు నిరాశ్రయులు కావడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని జమాల్‌పురం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామా నికి చెందిన నర్సా యాకయ్యలు తన కుల వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాల య్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.

### విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

పర్వతగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో యువ కుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఏనుగల్లులో శని వారం జరిగింది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన ప్రకారం.. ఏనుగల్లుకు చెందిన మాసాని దిలీప్(20) తన ఇంటికి మెట్లు కట్టడానికి ఐరన్‌రాడ్ తీసు కుని వెళ్తుండగా, పైన ఉన్న 11 కేవీ విద్యుత్‌వైర్లు తగిలి విద్యుదా ఘాతాని కి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతూ లారీడ్రైవర్..

నల్లబెల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంజీఎం దవాఖానాలో మండలంలోని బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బొల్లోనిపల్లి గ్రామా నికి చెందిన రాగుల రమేష్ (27) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యా నికి బానిసయ్యాడు. మద్యం తీవ్రంగా తాగడంతో రమేష్ శరీరంలో కాలేయం, ఊపిరితిత్తులు, కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని రోజులుగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాగుల రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

### 12 రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు..

**ఇద్దరి మరణంతో కుటుంబంలో తీవ్ర విషాదం**


సాయిరాం (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కుటుంబానికి పెద్ద దిక్కుయిన ఇద్దరు వ్యక్తులు 12 రోజుల వ్యవధిలోనే అనారోగ్యం బారిన పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన చిరతం మాధవిసంపత్ దంపతు లకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు చిరతం సాయిరాం (21) జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కుమారుడు శివరాం పదో తరగతి చదువుతున్నాడు. మాధవి మండల కేంద్రంలో ఆశ కార్యకర్తగా పని చేస్తోంది.

కాగా, చిరతం సాయిరాం రెండు నెలల క్రితం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. సిద్దిపేటలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా, డిసెంబర్ నెల 24న చిరతం సంపత్ (42) బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో మృతి చెందాడు. తన తండ్రి దశదిన కర్మ జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే కుటుంబం లో మరొకరు మృతి చెందటంతో కుటుంబం సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించాయి. కుటుంబంలో చిన్నవా డైన శివరాం దుఃఖాన్ని దిగమింగుకొని నాడు తండ్రికి, నేడు అన్నకు తలకొరివి పెట్టి హిందూ సంప్రదాయాల ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించాడు.

### ఎంసీపీఐ(యూ) నాయకుడి కన్నుమూత


యాకూబ్ (ఫైల్)

దుగ్గొండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే ప్రాణాలు కోల్పోయిన ఎమ్సీపీఐయూ నాయకుడు యాకూబ్ మరణం ఎంసీ పీఐ(యూ)కి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మండ లంలోని రెబల్లె గ్రామంలో సీనియర్ ఎంసీపీఐ (యూ) నాయకుడు యాకూబ్ అనారోగ్యంతో శనివారం మృతిచెందగా, ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. యాకూబ్ మాజీ ఎమ్మెల్యే దివంగత మద్దికాయల ఓంకార్ అడుగు జాడల్లో నడిచి పేదల పక్షాన పనిచేశారన్నారు. నివాళులర్పించిన వారిలో ఎంసీపీఐ (యూ) డివిజన్ కార్యదర్శి రాజసాహెబ్, నాగెల్లి కొంరయ్య, సింగతి మల్లికార్జున్, కుసుంబ బాబురావు, మాజీ సర్పంచ్‌లు ఎమ్డీహుస్సేన్, గీసుపాక కొంరయ్య పాల్గొన్నారు.

# ఆకేరుపై అదే విధ్వంసం

- కొనసాగుతున్న మట్టి, ఇసుక తవ్వకాలు
- విద్యుత్ స్తంభాలను పరిశీలించిన అధికారులు
- భూ యజమానులపై పోలీసులకు ఫిర్యాదు
- నోరుమెదపని మిగతా వివిధ శాఖల అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో సర్వత్రా చర్చ


లాబర్తిలో ఇసుక తవ్వకాల్తో ప్రమాదకరంగా మారిన స్తంభాలను పరిశీలిస్తున్న ఏడీఈ నటరాజ్, వెనుకాలే జేసీబీతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

వర్ధన్నపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వానెలనెలా మామూళ్లు ఇస్తున్నాం.. మాకెంటి భయం..? మమ్మల్ని ఆపేదెవరు..?, మా భూమి మా ఇష్టం.. మా ఇష్టమొచ్చినట్లు చేస్తాం. ఇదేమైనా కొత్తగా చేస్తున్నామా..? కొన్నేళ్లుగా నడుస్తోంది. ఇప్పుడు అధికారులు వస్తే ఆపేయాలా..? పంట పండితే ఏమొస్తుంది..? అదే మట్టి తీసి అమ్మితే ఒకేసారి రూ.లక్షల్లో డబ్బులు వస్తాయి..

..ఇదీ శనివారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల్లో మట్టి, ఇసుకను తవ్వుతున్న భూ బకాసురుల తీరు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'ఆకేరు కన్నీరు' కథనంపై రైతుల ముసుగులో ఉన్న భూ బకాసురులు, జేసీబీ యజమానులు మాట్లాడిన అంశాలు. అయినా యథేచ్ఛగా మళ్లీ జేసీబీ సహాయంతో తవ్వకాలు జరుపుతూ మట్టిని తరలించారు. ఇటు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్‌లు ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను పరిశీలించే


భూమి యజమాని, జేసీబీ, ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

దుకు మండలంలోని ల్యాబర్తి గ్రామంలో వెళ్లగా ఎలాంటి భయం, బెదురు లేకుండానే మళ్లీ పైపు జేసీబీ సహాయంతో మట్టిని తవ్వే దృశ్యాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. రైతులతో, జేసీబీ యజమానులతో మాట్లాడిన అధికారులతో సైతం 'నీళ్లు లేక మట్టిని అమ్ముతున్నాం..' అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు. దీంతో విద్యుత్ అధికారులు చేసేదేమీ లేక ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను లెక్కపెట్టుకుని తిరుగు ముఖం పట్టారు. ఈ సందర్భంగా భూ యజమానులైన బత్తిని పెద్ద రాజబాబు, బత్తిని చిన్న రాజబాబు, గద్దం కుమార స్వామి, ఎమ్డీయాకూబ్, బూదిద అంజయ్య, బూదిద బాస్కర్, బూదిద వీరన్న, ముంజాల కొమ్మాలులపై వర్ధన్నపేట ఏఈ తరుణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులకు సమాచారం లేకుండా స్తంభాల చుట్టూ మట్టిని తీయడం వలన హానికర పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. స్తంభాలు తరలించి, ప్రజలకు విలువైన సామగ్రికి నష్టం లేకుండా చూడాలని, లేకుంటే కఠిన చర్యలుంటాయని, పోలీసులు సైతం ఈ ఫిర్యాదుతో చర్యలు తీసుకోవాలని కోరారు.

**నిద్రమత్తులో మిగతా శాఖల అధికారులు**

ఆకేరు వాగులో జరుగుతున్న తతంగంపై మిగతా వివిధ శాఖల అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారుల దృష్టికి విషయం తెలిసినప్పటికీ దీనిపై మాట్లాడకపోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ స్థాయి అధికారి సైతం జరుగుతున్న పరిస్థితిని తెలుసుకోపోవడంతో అక్రమార్కులు మళ్లీ తవ్వకాలు చేస్తుండడంతో గ్రామస్తులు నివ్వెరపోతు న్నారు. కాగా, ఆకేరు వాగు పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి విధ్వంసాన్ని ఆపేలా చూడాలని గ్రామస్తులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపితేనే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

## ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలి

నర్సంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ. రాంబాబు అన్నారు. నర్సంపేట పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు, ఆశలకు రూ.18వేల వేతనం ఇస్తామని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేస్తామని, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12వేల భృతి ఇస్తామని, ఇలా అనేక హామీలు ఇచ్చి సంవత్సర కాలం గడిచినా నేటికి ఒక్క హామీ అమలుచేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, సంతోష్, గోనె యువరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

### రేవూరిని కలిసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు


సమస్యలను ఎమ్మెల్యే రేవూరికి వివరిస్తున్న ఎస్ఎస్ జాక్ నాయకులు

గీసుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను సీఎంతో మాట్లాడి పరిష్కరించే విధంగా చూడాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యో గులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని శనివారం కలిసి విన్నవించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వరంగల్‌కవస్తున్న నేపథ్యంలో తమను కలిసి సమస్యలు విన్నవించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి డిప్యూటీ సీఎంను కలిసేందుకు అవ కాశం కల్పిస్తానని చెప్పినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమం లో జాక్ నాయకులు శ్రీధర్, సుమ, ఎస్‌ఓలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### గీసుగొండ జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గీసుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించే గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల జాతర వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి శనివారం మొగిలిచర్లలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాంబరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక లావాదేవీలు అందించాలి

నర్సంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక లావాదేవీలను అందించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని పీటీవో కార్యాలయంలో పీటీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ కమ్యూటేషన్, జీపీఎఫ్, జీఎల్ ఐసీ, పెన్షన్ ప్రయోజనాలు అందలేదన్నారు. అన్ని రకాల లావాదేవీలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కర్ర సుదీర్‌బాబు, సదానందం, కందుకూరి సురేందర్, రాజేలు, అక్కపెల్లి శ్రీనివాస్, గుంటి రాంచందర్, లక్ష్మయ్య, నర్సింహ రాములు, బండెల రామస్వామి, వెంకటస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేటలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

### ఘనంగా ఎంఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవం


జెండావిష్కరణ చేస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

నర్సంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మహజన సోషలి స్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జెండాను జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామిక హక్కుల కోసం మంద కృష్ణమాదిగ ఎంఎస్‌పీని స్థాపించారన్నారు. తెలంగాణలో 93శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ మహిళలకు సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికై ఉద్యమిస్తుంద న్నారు. కార్యక్రమంలో తడుగుల విజయ్, కొదాలి సదానందం, ఆరోగ్యమ్మ, కత్తి రాములు, స్వప్న, రజిత, సమ్మక్క పాల్గొన్నారు.

## జాతి వైరాన్ని మరచి..

- కోతి, కుక్కల స్నేహం

వర్ధన్నపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జాతి వైరాన్ని మరచి ఓ కోతి, కుక్కల మధ్య మైత్రిగా మారిన సంఘటన వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంటోంది. బస్టాండ్ ఆవరణలో ఓ వానరం, శునకం దోస్తీ చేస్తున్నాయి. కలిసిమెలిసి కలిసి ఉంటూ పరిచితుల్లో సంచరిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడైనా వానరాలు శునకాలను చూస్తే ఆమెడ దూరం పరుగులు పెడతాయి. కానీ, ఇక్కడ అలాంటి సన్నివేశానికి భిన్నంగా ఉంది. చక్కటి చెలిమి చేస్తూ కలిసి జీవిస్తున్నాయి. మానవ సంబంధాలు ప్రశ్నార్థకంగా మారిన నేటి ఈ ఆధునిక సమాజంలో వానరాలు, శునకాలు కలిసి ఉండడం విశేషంగా మారింది.



### చేయూతగా నిలిచిన చిన్ననాటి మిత్రులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన దోపతి రవీందర్‌రెడ్డి గత నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆ కుటుంబానికి చిన్ననాటి మిత్రులు చేయూత నిచ్చారు. బాధిత కుటుంబాన్ని 1995-96 విద్యా సంవత్సరం పదో తరగతి మిత్రులు శనివారం దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించి, రూ.60 వేల ఆర్థికసాయం అందజేశారు. మిత్రులు వాకిటి లావణ్య, బొంత రవీందర్, కుంచె కుమారస్వామి, విజయ్, కావటి, రాజు, భూపాల్, శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### రామస్వామి కుటుంబానికి అండగా నిలుస్తాం

- డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి


రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగారెడ్డి

నర్సంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు గొర్రె రామస్వామి కుటుం బానికి అండగా ఉండి ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని రకాల రాయి తీలు అందేవిధంగా చూస్తామని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. మండలంలోని ఇటికాలపల్లి ప్రాథమిక పాఠశా లలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే గుండెపోటుతో మృతి చెందిన జి.రామస్వామి చిత్ర పటానికి శనివారం డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి లింగారెడ్డి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. డీటీఎఫ్‌లో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ, విద్యాభివృ ద్ధికి, పని చేసిన రామస్వామి మరణం డీటీఎఫ్‌కు తీరని లోటన్నారు. ఆయనవెంట రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, కనుకుల కొమ్మాలు, దార్ల రవీందర్, సర్వర్, కుమారస్వామి, కొర్ర రమేశ్, బి.వెంకటేశ్వర్లు, పాలకుర్తి రాజేందర్, వి.శ్రీనివాసరావు, రవి, ఈదుల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, నెల్లుట్ల బాస్కర్ ఉన్నారు.


వాహనదారులకు పుష్పగుచ్చాలు అందిస్తున్న ఎస్సై

### హెల్మెట్లు ధరించి ప్రమాదాలు నివారించాలి

దుగ్గొండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు హెల్మెట్‌లు ధరించి ప్రమాదాలను నివారించాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గిర్నిబావి ప్రధాన రహదారిపై శనివారం వాహనదారులకు పోలీసు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు, పూల బోకేలు అందించి ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. వినూత్నంగా పోలీసు లు చేపట్టిన కార్యక్రమం వాహనదారులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

వర్ధన్నపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వర్ధన్నపేట ఆరఅండ్‌బీ ఏఈ మేరుగు రాజు సూచించారు. శనివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో పలు ప్రైవేటు షాపుల ఎదుట జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన షాపుల బోర్డులను తీసివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి క్రాస్ నుంచి వర్ధన్నపేట వరకు 563 వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి ఇరు పక్కల ఉండే ప్రైవేటు షాపుల యజమానులు బోర్డులను 10ఫీట్ల లోపల ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. రేడియంతో నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేసే సూచిక బోర్డులు కనిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

వర్ధన్నపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మునిసిపల్ పరిధిలోని కొండేటి ప్రసాద్ తల్లి కొండేటి సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మృతురాలి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

### కస్తూర్బాలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

చెన్నారావుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిలకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం డాక్టర్ నరేష్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

నర్సంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందిన సంఘటన నర్సంపేట మండలంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చెందిన కదిరే అనిల్ ఈ నెల 1న సర్వాపురం ప్రధాన రహదారి మీదుగా ఖానాపురం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా భద్రాచలం వెళ్తున్న మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుకాల నుంచి ఢీకొట్టింది. దీంతో అనిల్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అలాగే మండలంలోని ఆత్మకూరుకు చెందిన భాక్య సుమన్ (30) పుట్టింటి నుంచి భార్య అత్తారింటికి రాకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 2న పురుగుల మందు తాగగా, ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.